


హత్య ఎలా జరిగిందో అంతు పట్టడం లేదు.

చాలా సేపటి నుంచీ పోలీసులూ, నేనూ తర్జన భర్జన పడుతున్నాం. శవం వీపులో గాయం వుంది. పదునైన ఆయుధంతో పొడిచి చంపారు. ఆయుధం నేరుగా వెన్నెముకకు ఎడం పక్కకు దిగి గుండెను తాకింది. శవం బోర్లగిలపడిపోయి వుంది.

ఆయుధం దొరకలేదు. హంతకుడు లేదా హంతకురాలు ఆయుధంతో పరారయ్యారా! శవాన్ని ఇంతవరకూ చూడలేదు నేను.

"అది అసంభవం! ఆయుధం తిరిగి వెనక్కి లాగలేదు. లాగితే కండరాలు తిరిగి తెగే వీలు మరో రకంగా వుంటుంది. ఆయుధంతో పొడిచాక దాన్ని తిరిగి వెనక్కి తీసుకోలేదు హత్య చేసినవాళ్లు" అన్నాడు పోస్టుమార్టం చేసిన సర్జన్.

"ఏమయింది? ఆయుధం అక్కడికక్కడే తన పని ముగించుకుని మాయమైపోయిందా" అన్నాను.

మిస్ చంచల తరపు బంధువులు నాకు బాగా కావలసినవాళ్లు. వాళ్లే నాకు ఆమె హత్య కేసును పరిశోధించమని పురమాయించారు.



ఎం.వి.వి. సత్యనారాయణ

# మిస్ చంచల

సర్జన్ వైపు పరిశీలనగా చూశాను.

"నేనోసారి గాయం చూడాలి!" అన్నాను.

సర్జన్ మెల్లిగా బల్లముందు నుండి లేచాడు. ట్యూబ్‌లైటు కాంతి ఆయన నున్నటి బట్ట తలమీద పడి మెరుస్తోంది. డిసెక్షన్ వార్డ్‌లోకి నడిచాడు.

ఆయనను వెంబడించాను.

శవం బోర్లాగిల వుంది. నగ్నంగా వున్న శరీరం మీద లావుపాటి నరంతో వేసిన కుట్లున్నాయి. డిసెక్షన్ చాలా సున్నితంగా చేశాడు సర్జన్.

మిస్ చంచల వీపు మీద చిన్న రంధ్రం వుంది. రంధ్రం వూడుకుపోనా మానవా అన్నట్టు వూడిపోతోంది. గాయంలోంచి తెల్లగా కనిపిస్తోంది మాంసం.

వీపు మీద రక్తం, యితర ద్రవాలూ అంటి వున్నాయి.

శ్రవణంతో గాయం తెరిచి పట్టుకున్నాడు డాక్టర్.

"కండరాలు ఒక వైపుకే అంటే లోపలి వైపుకే కత్తిరించినట్టు తెగాయి. హత్యకు పనికి వచ్చిన ఆయుధం గనుక తిరిగి వెనక్కి ఈ గాయంలోంచి ప్రయాణం చేసి వుంటే కండరాలు అన్నిప్రక్కలా మరో వాలులో చీరుకుపోవాలి. కత్తిని ఎంత వాటంగా, వేగంగా గుచ్చాడో అంత వాటంగానూ, వేగంగానూ వెలుపలికి లాగవలసి వుంటుంది. అంటే హత్యాయుధాన్ని తిరిగి పొందాలని వుంటే - అలా కాక పోయినట్టయితే యిక ఆయుధాన్ని మాయంచేయవలసిన అవసరం ఏం వుంటుంది? అంటే ఆయుధాన్ని బట్టి హత్యచేసినవాళ్లను గుర్తుపట్టగలమని..." సర్జన్ మాటలకు అడ్డం వెళ్ళాను.

"అసలు ఆయుధం యినతలికి రాలేదనుకున్నప్పుడు తర్వాత ప్రశ్నలు ఉత్పన్నం కావు గదా!"

"అవునవును. ఆయుధం పదునైనది. అంత వరకు చెప్పగలను. హరించుకు పోదు!"

"మిస్ చంచలను అంత ఖచ్చితంగా గుండెలలో పొడిచి చంపగలగడంలో మీ అభిప్రాయం చెప్పండి!"

సర్జన్ బలంగా వూపిరి పీల్చి "హంతకురాలికి హత్య చేసినవాళ్లు బాగా సన్నిహితులై వుండాలి. లాలించి సరాగాలాడుతూ హతురాలు సరాకుగా వున్నప్పుడు హత్య జరిగి వుండాలి హత్య ఆమె డబుల్‌కాట్ మీద వుండగా జరిగింది. కాబట్టే మిస్ చంచలతో రొమాన్స్ జరుపుతూ హత్య చేసివుంటారు!" అన్నాడు.

'అంటే హత్యచేసింది మగవాడే అయుండాలి!'

సర్జన్ యిబ్బందిగా కదిలాడు. మగవాడే కావాలి! కాని ఆమెను హత్యా సమయానికి అటూ ఇటుగా ఒక ఆడమనిషి కలిసిందని చుట్టుపక్కల అనుకున్నారట. ఈ విషయం క్రైం బ్రాంచి ఆఫీసులో కనుక్కోండి అన్నాడు.

నాకు ఆశ్చర్యంగా వుంది. అన్నీ చిక్కుముడులే! మిస్ చంచల రొమాన్స్ సమయంలో హత్యకు గురైంది. ఆ సమయంలో ఆమెను మగప్రాణి కలుసుకోలేదని ఒక సాక్ష్యం.

మిస్ చంచల వొంటి మీద దుస్తులున్నాయా? అడిగాను.

మేము చూసేటప్పటికి లేవు. దుస్తులు వార్డ్‌రోబ్ మీదున్నాయి!

మనం ఒకసారి మిస్ చంచల శవం కనిపించిన గదికి వెళ్దాం. మీకు పనేమీ లేకపోతే రాగలరా?" మృదువుగా అడిగాను.

"తప్పకుండా వెళ్దాం మిస్టర్ శిరీష్! ఈ కేసులో నాకు ప్రత్యేకమైన ఆసక్తి వుంది!"

"అయితే రండి! నా కారులో ముందు క్రైం బ్రాంచి కార్యాలయానికి వెళ్దాం. తర్వాత మిస్ చంచల యింటికి!

సర్జన్ సొరుగు మూశాడు.

మిస్ చంచల శవం మాయమైంది.

సర్జన్ నేను క్రైం బ్రాంచి కార్యాలయంలో ప్రత్యక్షమయ్యాం.

క్రైం బ్రాంచి యిన్‌స్పెక్టర్ మమ్మల్ని సాదరంగా రిసీవ్ చేసుకున్నాడు. ముగ్గురమూ కూర్చున్నాం. కాఫీలు వచ్చాయి.

"మిస్ చంచల ఎన్ని గంటలకు చనిపోయింది? నిశ్శబ్దాన్ని కదిపాను.

"నువ్వు యింకా రిపోర్టు చూడలేదా శిరీష్? మిస్ చంచల రాత్రి పది గంటల తర్వాతా, పదిన్నర ముందూ - ఖచ్చితంగా చెప్పుకోవాలంటే పదీ ఇరవైకి ప్రాణంపోయినట్టు నిర్ధారణ అయింది అన్నాడు కుమార్.

"మిస్ చంచల పది గంటల ప్రాంతంలో కానీ, చచ్చిపోయే ముందు చివరిసారిగా గానీ ఎవరిని కలిసింది?"

"పది గంటలకుముందు మిస్ చంచల యింటి ముందు కారాగింది. కారులోంచి ఒక స్త్రీ దిగి మిస్ చంచలను కలిసింది."

"ఆమె ఎవరు?"

"ఆరా తీస్తున్నాం. ఆమె వచ్చింది అంబాసిడర్ కారు. ట్యూబ్‌లైట్ వెలుతురులో కారు రంగు గచ్చకాయరంగు అని ట్రాఫిక్ కానిస్టేబుల్ చెప్పాడు.

కారులోంచి యువతి లోపలకు వెళ్లింది. అంతే కాని మిస్ చంచలని ఆమె కల్సినట్టు కానిస్టేబుల్‌కు తెలియదు. అవునా!"

కుమార్ మందహాసం చేసి తలూపాడు.

"ఆమెకెంత వయసుంటుంది?"

చెప్పలేకపోయాడు కానిస్టేబుల్.

"కారు గురించి ఆరా దొరకలేదా?"

కుమార్ ఇబ్బందిగా కదిలాడు

## 2

టి.నగర్‌లో ఉస్మాన్ రోడలో వుంది చంచల భవంతి. నాలుగు రోడ్ల కూడలికి దగ్గరలో వుంది. ఆకుపచ్చ రంగు డాబా యింటి ముందు కానిస్టేబుల్ కాపలా వున్నాడు.


ఇంట్లోకి నడిచాను. అప్పటికే సర్జన్, ఇన్‌స్పెక్టర్ కుమార్, సార్జంటూ బెడ్‌రూమ్‌లో వున్నారు.

మిస్ చంచల కళాభిరుచి వున్న స్త్రీ. బెడ్‌రూం అత్యాధునికంగా అలంకరించి తన అభిరుచిని వ్యక్తం చేసింది.

బెడ్‌ప్రక్కనే టీపాయ్ మీద ఆలివ్ కలర్ టెలిఫోన్ పెట్టి వుంది.

బెడ్ వద్ద నిలబడ్డాను. గది రాత్రి నుండి మూసి వుంది. అందుకే గుబురు వాసన వస్తోంది. వార్డ్‌రోబ్ మీద బట్టలు అలాగే వున్నాయి.

సార్జెంట్ నా అభిప్రాయం కనిపెట్టినట్టుగా కిటికీలు తెరిచాడు.






బెడ్‌రూం తడిగా వుంది. తడిగా వున్న ప్రాంతంలో బెడ్‌షీట్ రంగు ముదురుగా కనిపిస్తోంది.

వేలితో తడి ప్రాంతం తడిమాను. నా వేలుకు రక్తం అంటలేదు. ఆశ్చర్యపోయాను. వేలు వాసన చూశాను. ఎలాంటి వాసనా లేదు. బెడ్‌ను తడిపిన ద్రవం రక్తం కాదు. మూత్రమూ కాదు. బెడ్ నీట్‌గా సర్దినట్టుగావుంది కాబట్టి మిస్ చంచలతో ఎవరూ రొమాన్స్ జరపలేదు.

ఆ ద్రవం ఏమిటి? మిస్ చంచల బోర్లగిల పడి వుంది. ద్రవం పడివున్న స్థానంలో ఆమె ఛాతీ వుండాలి. గదిని వెతకసాగాను. కుమార్ చిన్నగా దగ్గి వూరుకున్నాడు. అతడి అభిప్రాయం నాకు అర్థమైంది. గదిని పోలీసులు వెతికారు. ఏమీ అనుమానించ దగిన వస్తువులు దొరకలేదన్న మాట! పోలీసులకు ప్రధానంగా తోచని వస్తువులు దొరకవచ్చు. బెడ్‌క్రిందకు తల వొంచి చూశాను. బెడ్ క్రింద శుభ్రంగా తుడిచి వుంది. బెడ్‌కి ఒక ప్రక్క కుడి వైపుగా ధాన్యపు పొట్టు వుంది. ధాన్యపుపొట్టు పడి వున్న ఆకారం విచిత్రంగా వుంది.

బెడ్ క్రిందకు ధాన్యపు పొట్టు ఎందుకు వుంది? బెడ్ క్రింద నీట్‌గా తుడిచిన వాళ్ళు ధాన్యపు పొట్టుని తుడవలేదంటే శుభ్రపరిచాకనే పొట్టు అక్కడికి వచ్చి వుండాలి. కార్పెట్ మీద ధాన్యపు పొట్టు వుండడం ఏమిటి?

పొట్టు మధ్యలో వ్రేలితో తడిమాను. కార్పెట్ ముదురురంగులో వుంది. అక్కడ కూడా తడిగా వుంది.

మదురు చిట్లించి లేచి నిలబడ్డాను. గదిలోంచి బయటికి నడిచి ట్రాఫిక్ కానిస్టేబులును కలిశాను.

అతడు ట్రాఫిక్‌ను అదుపులో పెడుతూ నా ప్రశ్నలకు సమాధానాలివ్వడానికి సిద్ధపడ్డాడు.

"రాత్రి నువ్వు గచ్చకాయరంగు కారు మిస్ చంచల యింటి ముందు ఆగడం చూశావు కదూ!" అడిగాను.

"అవును సార్."

"ఆ కారును మరల చూస్తే గుర్తుపట్టగలవా?"

"పట్టగలననుకుంటాను సార్! ఎడమవైపుగా బోనెట్ మీద రేడియో ఏరియల్ నిలబడి వుంది."

"కారులో ఎంత మంది వచ్చారో చెప్పగలవా!"

"ఒక్కరే అనుకుంటాను సార్! ఆమె కారు దిగి యింట్లోకి వెళ్ళింది!"

"అప్పుడు కారులో ఎవరూ లేరా?"

"లేరు సార్! ఆమె డ్రైవింగ్ సీట్లోంచి దిగింది."

"ఆమెను స్పష్టంగా చూశావా?"

"లేదు సార్! వీధిలో ట్యూబ్‌లైటు వెలుతురు రాత్రి డిమ్‌గా వుంది. పైగా ఆమెను కొద్ది క్షణాల పాటే చూశాను."

"ఆమె చేతిలో హాండ్‌బాగ్ లాంటిదేమైనా వున్నాయా?"

"హాండ్‌బాగ్?" కానిస్టేబుల్ ఆలోచనలో పడ్డాడు.

"బాగా గుర్తు తెచ్చుకో! ఆమె కత్తితో వచ్చి వుండాలి. మిస్ చంచలను కత్తితో పొడిచి వుండాలి. కత్తిని దాచి తీసుకురావాలంటే ఆమె..."

"చెబుతాను సార్. ఆమె భుజానికి థర్మాస్ ఫ్లాస్కు వ్రేలాడింది!"

"ఫ్లాస్కా?"

"అవును సార్! పది కప్పులు టీ పట్టే ఫ్లాస్కు!"

"ఫ్లాస్కా? ఆమె ఫ్లాస్కు తీసుకు రావలసిన అవసరం ఏముంది? ఒకవేళ ఆమె రాకముందే మిస్ చంచల హత్య జరిగిపోయిందా?"

"ఆమె సరిగ్గా ఎన్ని గంటలకు వచ్చిందో చెప్పగలవా?"

"రాత్రి పది గంటలకు ముందు సార్!"

"తిరిగి వెళ్ళడం?"

"ఆమె తిరిగి వెళ్ళడం చూడలేదు సార్!"

"వెంటనే మాత్రం తిరిగి రాలేదు కదా!"

"తిరిగి రాలేదు సార్!"

"ఆమె లావుగా వుందా? సన్నగా వుందా?"

"లావుపాటి మనిషే సార్!"

"నడకలో కంగారు కానీ, తొట్రుపాటుతనం గానీ వున్నాయా?"

"లేవు సార్!"

"ఆమె భుజానికి ఫ్లాస్కు తప్ప ఎలాంటి హాండ్‌బాగూ లేదు. అవునా?"

"అవును సార్!"

తలూపి అతడికి కృతజ్ఞతలు చెప్పి బయల్దేరాను.

మెదడులో ఆలోచనల కొసలందినట్టే అంది మాయ మవుతున్నాయి. ఫ్లాస్కు - ధాన్యపు పొట్టు - బెడ్‌షీట్ తడి - కార్పెట్ తడి!

"ఏమైనా తెలిసిందా!" అడిగాడు కుమార్.

"హత్య చేసింది ఆడమనిషే! అయితే మిస్ చంచల నగ్నంగా బెడ్ మీద వుండవలసిన పరిస్థితి ఎలా సంభవించింది?"

"ఆడమనిషే హత్య చేసినట్టు ఎలా చెప్ప గలరు?" అడిగాడు సర్జన్.

"ఆమె తర్వాత హతురాలిని కలిసినవాళ్ళు లేరు. ఆమె ఫ్లాస్కుతో వచ్చింది. ఫ్లాస్కులో కత్తిని దాచి తెచ్చి వుండాలి!"

"ఫ్లాస్కులో కత్తా?" కుమార్ పరిహాసంగా నవ్వ బోయాడు.

అతడిని జాలిగా చూశాను. డిపార్ట్‌మెంట్‌లో నానాటికీ బుద్ధిబలానికి పని తగ్గిపోతోంది!

"మిస్. చంచలకు బంధువులెవరున్నారు?" అడిగాడు సర్జన్ తిరిగి.

"తేనాంపేటలో ఆమె సోదరుడున్నాడు. అతడికి ఈమె వ్యవహారం నచ్చక దూరంగా వుంటున్నాడు. తన మీద కానీ, తన కుటుంబం మీద కానీ మిస్ చంచల ప్రవర్తన తాలూకూ ప్రభావం పడకుండా జాగ్రత్తపడుతున్నాడు. అతడికి భార్యా, ముగ్గురు పిల్లలూ... ఈ ఇంట్లో మిస్ చంచల ఒక్కతే వుంటుంది. పగటి పూట పని మనిషి వుంటుంది. రాత్రిళ్ళు నౌకరు ఒకడు బయట కాపలా వుంటాడు." అన్నాడు కుమార్.

"నౌకరు రాత్రి లేడా?" అడిగాను.


"రెండు రోజులయి అతడు రావడం లేదట!"

"ఏం!"

మిస్. చంచల అతడిని తిట్టిందట. ఇంటికి వచ్చే పోయే మగవాళ్ళతో అతడు మాట్లాడుతున్నాడని ఆమె గమనించిందట!"

"అదే పెద్ద నేరమా?" అడిగాడు సర్జన్.

"సినిమా మనుషులవి చీకటి బతుకులు! వాళ్ళకు ప్రతి ఒక్కరూ అనుమానించదగిన వాళ్ళలాగానే కనిపిస్తారు. అంత ఎందుకు. నాకు తెలిసిన ఫోటో గ్రాఫర్ దర్శకుడొకడు చిత్ర కథకు సహకారం కోసం ఒక






రచయితను పిలిపించుకున్నాడు. మధ్యలోనే అతడికే పూర్తిగా కథారచన పేరు వచ్చేస్తోందని అనుమాన పడిపోయాడు. కథా మాటలూ స్క్రీన్‌ప్లే దర్శకత్వానికి ఎక్కడ ఏ బ్రాంచ్ తన గుప్పెట్లోంచి జారిపోతుందోనని పూరకనే భయసందేహాలకు గురయాడు. రచయితను సహకారం వద్దని బతిమాలుకుని ఇంటికి పంపించేశాడు. తిరిగి అతడే ఎవరో ఏదో రాజకీయం నడుపుతున్నారని అనుమానం పడుతుంటాడు!" అన్నాను.

"అదేమిటి? ఈ సినిమా మనుషులు అంత కృతఘ్నులా?"

"అందరూ కాదు! ఎదిగీ ఎదగని ఫోటాగాళ్ళు అక్కడక్కడా వుంటారు. మిస్ చంచల ఆ రకమైన ఫోటావాంప్! ఆంధ్రుల అభిమానం కోసం అర్రులు చాస్తూ వొళ్ళుదాచుకోకుండా నవిచేసి పెట్టే కళాకారిణి!" అని కొద్ది క్షణాలాగాను.

"ఆమె ప్రస్తుతం ఏయే కంపెనీలకు పనిచేస్తోందో తెలుసుకున్నావా కుమార్?" అన్నాను.

"నాట్య చిత్ర వాళ్ళకూ భువనశ్రీ ఫిలింస్‌కీ రెండు పాటలు- అదే క్లబ్ డాన్సులు చేసి పెడుతోందట! వాళ్ళను దర్యాప్తు చేశాను.

'ఏం తెలిసింది?'

"రెండు కంపెనీలూ ఇంకా మొదటి షెడ్యూల్ చిత్రీకరణలో వున్నాయి. మిస్ చంచలకు రెండో షెడ్యూల్‌లో పని వుంది!"

"వాళ్ళు మద్రాస్‌లోనే తీస్తున్నారా!" అవుట్ డోర్ వెళ్ళిపోయారా?"

"ఇక్కడే యిన్‌డోర్‌లో తీస్తున్నారా!"

చంచల గురించి యింకా వివరాలు తెలిశాయా?

"భువనశ్రీ ఫిలింస్ నిర్మాత నాయుడుకి ఈమె అంటే ఎక్కువ మోజు వుంది. అయితే అతడు నిన్నంతా మిస్ చంచలను కలవలేదు!"

"ఎలా రుజువయింది?"

"నాయుడు నిన్న ఉదయం ఇన్‌డోర్ షూటింగ్ సమయంలో కాలు జారిపడ్డాడు. నిన్న పుదయం నుండీ ఇప్పటి వరకూ అతడు కాలుకదపలేని పరిస్థితి!"

"మిస్ చంచలే అతడిని కలిసిందేమో!"

"కలిస్తే మాత్రం ఏం తెలుస్తుంది?"

"చెబుతాను. నాయుడు ఏ ఆసుపత్రిలో వున్నాడు?"

"కరుణా నర్సింగ్ హోం!"


"మనం అక్కడికి వెళ్దాం!"

కుమార్ తలూపి, "ఇక్కడ మనకు పనికివచ్చే ఆధారం లేదు కదా!" అన్నాడు.

"లేకేం? వుంది హత్య ఎలా జరిగిందో చూచాయగా ఒక అవగాహన కుదిరింది!" అంటూ బయటికి కదిలాను.

3

రివాల్వింగ్ ఛెయిర్‌లో చిరాకుగా కదిలాను. ఛెయిర్ కిర్రుమంది. మద్రాస్ మహానగరంలో గచ్చకాయరంగు కారుగానీ, కారులో మిస్ చంచల ఇంటికి వచ్చిన హంతకురాలు గానీ పట్టుబడలేదు. ఆర్.టి.ఓ. ఆఫీస్‌లో దర్యాప్తు జరుగుతోంది.




నాయుడు చెప్పిన సమాచారంలో నసలేదు. నిన్న పుదయం మిస్ చంచల అతడిని చూడవచ్చిందట. మిస్ చంచలను అతడు పెళ్ళిచేసుకుంటాడట. నలభై అయిదూ యాభైకీ మధ్యలో వుండే నాయుడి కళ్ళు మిస్ చంచల పేరెత్తేటప్పటికి మెరిసిపోయి అంతలోనే నీళ్ళు కమ్ముకున్నాయి. హత్య విషయం అతడికి ఉదయమే తెలిసిందట.

అతడికి పెళ్ళయింది. అయినా చంచలను రెండో పెళ్లి చేసుకుంటాడట.

అతడి భార్య సుబ్బులు ఒప్పుకుందట కూడా.

మిస్ చంచలను ఎవరు చంపారో అతడి వూహకు అందలేదు. నాయుడిని కలిశాక పరిశ్రమలో మిస్ చంచల గురించి ఆరా తీశాను. ఆమె ఇబ్బంది కలిగించే ఆర్టిస్టట. షూటింగ్ మధ్యలో ఎవరెవరో ఫ్రెండ్స్ వస్తారట. ఆడవాళ్లతో ఆమె ఏకాంతంగా వుండగా ఎవరూ ఆమెను కలవకూడదట.

నాకు విచిత్రమనిపించలేదు.

ఆడవాళ్ళు ఆమెకు విటులను తెచ్చిపెట్టే వాళ్లయి వుంటారు. మిస్ చంచల లాంటి ఆడతారలకు ఈ రకమైన ఏజంట్లు వుంటారు. ఇక్కడ ఇది సహజమే!

అయితే—

కేసు ఒక్క అంగుళం ముందుకు జరగలేదు.

హంతకురాలు విచిత్రంగా మిస్ చంచలను హత్య చేసింది. హత్యా యుధం దానికదే మాయమైపోయే లాగా చేసింది.

ఆలోచనలను భంగపరుస్తూ టెలిఫోన్ మోగింది.

"సార్! డిటెక్టివ్ శిరీష్ గారేనా మాట్లాడేది" తమిళంలో వినిపించింది.

"అవును. ఎవరు మీరు?" తమిళంలోనే అడిగాను.

"నన్ను పాణి అంటారు సార్!"

"ఎక్కడి నుండి ఫోన్ చేస్తున్నారు?"

"అశోక్‌నగర్- నాలుగో వీధిసార్! పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుండి!"

"చెప్పండి!"

"నన్ను ఆవిడ చంపుతానంది సార్!"

"ఎవరావిడ?"

"రాత్రి చంచలమ్మ గారింట్లో కనిపించింది సార్! నేను అమ్మగారి నౌకరును. రెండు రోజుల క్రితం అమ్మగారికి కోపం వచ్చి మానిపించేశారు సార్! నిన్న రాత్రి పది తర్వాత వస్తే డబ్బు లెక్క చూసి యిస్తానన్నారు సార్! పదిన్నరకు ఉస్మాన్ రోడ్లో గచ్చకాయ రంగు కారుకు అడ్డంగా నడిచి వెళ్ళి అమ్మగారి యింటి మెట్లెక్కబోయాను సార్! కారులోంచి నన్ను ఆగమని పిలుపు వినిపించింది సార్. కారులో ఆమె అప్పుడే మెట్లు దిగి వచ్చి కూర్చోవడం నాకు గుర్తొచ్చింది.

ఆమె వైపు చూడబోయాను.

కారులో చీకటిగా వుంది. ఆమె ఆకారం నాకు అస్పష్టంగా కనిపించింది. సార్!"

"ఎవరు?" అడిగిందామె.

చెప్పాను.

"అమ్మగారు నిద్రలో వున్నారు! వెళ్ళక!' అంది.

"నా జీతం గురించి చెప్పాను."

'వెళ్ళవద్దంటే వినిపించదూ! ఉదయమే రా! మాట వినకపోతే చంపేస్తాను!' అంది.

నాకు తలలోంచి చెమటలు పట్టాయి. ఆమె ఎవరు? ఎలా ధైర్యంగా బెదిరిస్తోంది? ఒక ఆడది నన్ను అలా అంత దగ్గర నుండి బెదిరించడం నాకు కొత్తగా వుంది!

నేను వెనక్కి తిరిగాను. ఆమె కారులో నన్ను వెంబడించింది. నేను మరీ తారెత్తిపోయాను. కారుతో నన్ను ఢీ కొట్టి చంపినా రక్షించే దిక్కు లేదు. రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి. మా యింటికి పారిపోయాను.

"మీ యిల్లు అశోక్ నగరా?" అడిగాను.

'కాదు సార్! ఉస్మాన్ రోడ్లోనే ఎడం ప్రక్క గుడిసెలు. చంచలమ్మ గారి యింటికి వంద గజాలుంటుంది మా యిల్లు!"

'ఉదయం చంచల గారింటికి వెళ్ళావా?"

'వెళ్ళాను సార్! పోలీసులున్నారు. ఎవరు దొరుకుతారా అన్నట్టు చుట్టూ అనుమానంగా చూస్తున్నారు సార్! అమ్మగారు చచ్చిపోయారని తెలిసింది సార్!"

"ఇప్పుడు అశోక్ నగర్ ఎలా వెళ్ళావు?"

"గచ్చకాయ రంగు కారు కనిపించింది సార్! ఎడమ వైపు రేడియో ఏరియల్ వూగుతోంది బోనెట్ మీద ఆటోలో కారు వెంబడించాను. వీధుల్లోకి తిరిగి మాయమయింది సార్!"

"కారును ఎవరు నడుపుతున్నారు?"

"లావు పాటి స్త్రీ సార్!"

నాకు గుండె వేగంగా కొట్టుకుంది. పాణి చూసింది హంతకురాలినే. రెక్కలుంటే ఎగిరి పాణి వద్ద వాలి వుండేవాడిని!

"ఆమె ఎలా వుంది? వర్ణించగలవా?"

టెలిఫోన్ రిసీవర్‌లో తలుపు తెరచిన శబ్దమయింది.

"ఆ! ఆ!" అన్నాడు పాణి. ఆ వెనకనే 'కిచ్‌క్... క్..." అన్న మూలుగూ, దబ్బున పడిపోయిన శబ్దమూ వినిపించాయి.

నేను కంగారుగా లేచాను. అనుకున్నట్టే అయింది. నేను కేసును పరిశోధిస్తోన్నట్టు పాణి గ్రహించి నాకు ఫోన్ చేశాడు. వీధి మలుపులలో మాయమైనట్టే మాయమై ఆమె పాణిని వెంటాడింది. టెలిఫోన్ బూత్‌లో పట్టుకుని సంహరించింది. సంహరించి

వుండకపోవచ్చునని ఆశపడ్డాను. టెలిఫోన్ బూత్ వద్ద అతడిని మాశాక గానీ హంతకురాలు ఎంత ఘాతుకురాలో నాకు తెలిసి రాలేదు.

పాణి వెల్లకి లా బూత్‌లో పడి వున్నాడు. అతడి కంఠం వద్ద గాయమై వుంది. గాయంలోంచి రక్తం ప్రవాహంలాగా కారుతోంది. రక్తం చిక్కగా లేకుండా పల్చగా వుండి అతడి మెడ క్రింద మడుగు కడుతోంది.

రక్తం ఎందుకు అంత పల్చగా వుందో నాకర్థమవుతోంది. నేను బూత్ వెతుక్కుంటూ అయిదు నిమిషాలు తాత్సారం చేయకుండా వుంటే హత్యకు పనికి వచ్చిన ఆయుధం తాలూకూ అవశేషాన్నయినా చిక్కించుకోగలిగేవాడిని.

కాని ఫలితం వుండేది కాదు. అది నా చేతుల్లో అయినా మాయమయేది.

హంతకురాలికి అలాంటి ఆయుధాలు ఎక్కడ దొరుకుతున్నాయి?

బ్యాత్ వద్ద జనం గుమికూడుతున్నారు.

కిందకు వ్రేలాడుతున్న రిసీవర్ జేబు రుమాలు చుట్టిన చేతిలో అందుకున్నాను.

జేబులోంచి పెనిసిలు తీసి నెంబర్లు తిప్పబోయి అంతలోనే గుర్తొచ్చి బటన్ నొక్కాను, తర్వాత నెంబర్లు తిప్పాను.

## 4

నాయుడు బెడ్ మీద లేచి కూర్చున్నాడు

నర్సింగ్ హోం ప్రశాంతంగా వుంది.

నాయుడి భార్య సుబ్బులు హార్లిక్స్ కలుపుతోంది.

"మీ తర్వాతి పిక్చర్‌లో నేను సగం పెట్టుబడి పెడతాను!" అన్నాను.

అప్పుడు నా వేషం మూస్తే మా పాప నన్ను గుర్తు పట్టలేదు. మా ఆవిడ సరే సరి. సినిమా పిచ్చితో కృష్ణా జిల్లా మాగాణి భూములను అయిన కాడికి అమ్మేసి హడావుడిగా మద్రాసులో రైలు దిగిన మోతు బరిలాగా వున్నాను.

నా మొహంలో ఆత్రుత!

నా కళ్ళలో ఆదుర్దా!

ఒకసారి వచ్చి వెళ్ళినా నాయుడు కూడా అందుకే గుర్తు పట్టలేకపోయాడు.

సుబ్బులు గుస గుసలాడుతూ నాకో గ్లాసూ, నాయుడి కో గ్లాసూ అందించింది.

చిన్న ఫ్లాస్కుకు మూత బిగించి ఆమె దూరంగా స్టూల్ లాక్కుని కూర్చుంది.

నాయుడు తలూపి, 'అలాగే లేండి! ముందు యీ పిక్చర్ పూర్తవనివ్వండి! మీరూ యిక్కడే వుండండి. నిర్మాణం వ్యవహారాలు తెలుస్తాయి.' అన్నాడు.

"మీకు కారు వుందా? మా కారు యిక్కడికి రప్పించనా?" అన్నాను.

"మీ కారు రప్పించండి! నాకు ఫియట్ కారు, వుంది."

సంతోషం ప్రదర్శించాను.

"ఆయన వద్ద సెలవు తీసుకోవడానికన్నట్టు లేవబోతూ," ఎవరో డాన్సర్ చచ్చిపోయిందట ఎందుకో పాపం?" అన్నాను.

"ప్చ్...... తెలియదు!" అన్నాడు నాయుడు తల తిప్పుకుని.




టాక్సీ మాట్లాడుకుని వళ్ళువార్‌కోట వద్ద దిగాను. హుందాగా నడుచుకుంటూ ఆ భవనం ముందాగాను.

ఇంటికి బోర్డ్ వ్రేలాడుతోంది.

భువనశ్రీ ఫిలింస్.

మద్రాస్—34

"కౌన్ హైసాబ్?" గేటు వద్ద వున్న గూర్ఖా పలకరించాడు.

"సుబ్బులు మాడం బేజాదియా!" అన్నాను.

"క్యోం?"

అతడికి దగ్గరగా నడిచి వెళ్ళి గడ్డం క్రింద ఒక్కటిచ్చాను. గూర్ఖా ముందుకు ఒరిగిపోతూంటే పట్టుకుని ముందుకు పడుకోబెట్టి తర్వాత మెల్లగా ప్రక్కకు యీడ్చాను భవనంలోకి నడిచాను.

పనివాడు ఎదురొచ్చాడు. అతడికీ అదే చికిత్స చేసి చకచక అన్ని గదులూ వెతకసాగాను. ఒక గదిలో నాకు కావలసిన వస్తువు దొరికింది. దాన్ని జాగ్రత్తగా కాగితంలో చుట్టి పాక్ చేశాను. ఆ గదిలోనే రిఫ్రిజిరేటర్ వుంది.

రిఫ్రిజిరేటర్ తెరిచాను.

ఐస్ క్యూబ్స్ తయారుచేసే కేస్ వుంది. కేస్ మధ్యలో సన్నగా పొడవుపాటి వస్తువు వుంది. దాన్ని మరో కాగితంలో చుట్టి జేబులో వేసుకున్నాను.

తరువాత గదిలోంచి బయటికి నడిచాను.

వంట మనిషి వంటింట్లో కూనిరాగాలు తీస్తోంది.

పనివాడికీ, గూర్ఖాకీ స్మెల్లింగ్ సాల్ట్ వాసన చూపించి రోడ్డు మీదపరుగెత్తిటాక్సీని చేరుకున్నాను.

టాక్సీని మిస్ వంచల యింటి ముందు ఆపించాను.

నా నిరీక్షణ ఫలించింది. ఆమె మెట్లు దిగి రోడ్డు మీదకు వచ్చింది.

"హేయ్ టాక్సీ!" అంది.

నేను టాక్సీని ఆమె వైపు నడిపాను. దిగి తలుపు తెరచి పట్టుకున్నాను. ఆమె భారమైన శరీరాన్ని సులువుగా వలింపచేస్తూ వెనక సీట్లో కూర్చుంది. తలుపు మూసి డ్రయివింగ్ సీట్లో కూర్చున్నాను.

"రంగరాజపురం పోనివ్వు. నాలుగో వీధిలో..." అంది.

టాక్సీని పరుగెత్తించాను. అద్దం సర్దుకుని ఆమెను మధ్య మధ్య పరిశీలించసాగాను. ఆమె కళ్ళు మగతగా వున్నాయి. పెదిమలు ఆత్రంగా వణుకుతున్నాయి. ఆమె నా పరిశీలనను గుర్తించే ధోరణిలో లేదు.

రంగరాజపురం నాలుగో వీధిలో పెంకుటింటి ముందాపాను టాక్సీ.

ఇంటి వరండాలో ఒక స్త్రీ పచార్లు చేస్తోంది. ఆమెను గుర్తుపట్టాను. నాయుడి యింట్లో ఆమెను వంట మనిషిగా మాశాను.

టాక్సీ దిగిన ఆమెను మాడగానే వంట మనిషి నవ్వింది.

నా టాక్సీలో వచ్చినామె నాకు బాడుగ వెల్లించి 'వెళ్ళిపో' అంది. తరువాత పెంకుటింటి వైపు కదిలింది.

## 5

టాక్సీని మెయిన్ రోడ్లోకి తీసుకు వచ్చాను.

తర్వాత నడుచుకుంటూ పెంకుటింటికి వచ్చాను.

లోపలి గదిలో మాత్రం దీపం వెలుగుతోంది.

చప్పుడు చేయకుండా ఆ గదికి దగ్గరగా నడిచాను.

గదిలోంచి వేడి నిట్టూర్పులూ, శృంగారపరమైన అశ్లీల పదాలూ వినిపిస్తున్నాయి. యిద్దరూ లెస్బియన్స్.

"వంపెయ్! కొరికెయ్!" అంటోంది టాక్సీ దిగినావిడ.

కెమెరా తీసుకున్నాను. కిటికీలోంచి మాశాను.

ఇద్దరు ఆడవాళ్ళూ నగ్నంగా వున్నారు. ఒకరి మీద ఒకరు దొర్లుతూ ప్రకృతి విరుద్ధమైన శృంగార కాండలో నిమగ్నమై వున్నారు.

చకచక చక ఫ్లాష్ వెలిగింది.

వాళ్ళిద్దరూ పట్టించుకునే స్థితిలో లేరు.

ఏమైతేనేం! వాళ్ళిద్దరూ లెస్బియన్స్ అనే ఆధారం దొరికింది. అంతే చాలు! ఆడవాళ్ళతో ఆడవాళ్ళే శృంగారం జరిపే జాతి లెస్బియెన్స్.

* * *

సుబ్బులు వైపు మాశాను. కటకటాలకు తల ఆన్చి చూస్తోంది ఆమె. మంచుకత్తితో ఆమె మిస్ వంచలను చంపింది. మిస్ వంచల కూడా లెస్బియన్. ఆమెతో శృంగారం నటిస్తూనే బెడ్ క్రింద దాచిన మంచు కత్తితో మిస్. వంచలను వీపులో పొడిచి చంపింది. తనకు లెస్బియన్‌గా వుంటూనే తన భర్తతో రెండో పెళ్ళికి సిద్ధపడినందుకు ఆమె మిస్ వంచల మీద పగపట్టింది. మంచుకత్తి జాగ్రత్త పెట్టి తెచ్చిన ఫ్లాస్క్ మీద ఆమె వ్రేలి ముద్రలున్నాయి. వ్రేలి ముద్రలు మిస్ వంచల గదిలో నాకు దొరికాయి.

పాణి తన విషయం ఎక్కడైనా గుర్తు పట్టి బయట పెడతాడేమోనని అతడిని చంపింది. చివరికి తన లెస్బియన్ వంట మనిషితో ప్రకృతి విరుద్ధమైన శృంగారం జరుపుతూ నాకు మరింత బలమైన సాక్ష్యం యిచ్చింది.

మంచు కత్తి తయారుచేసుకునే అర రిఫ్రిజిరేటర్‌లో దొరకడమే కాదు, అది సుబ్బులుకు తయారుచేసి యిచ్చిన వ్యక్తి కూడా దొరికింది.

ఆమె సుబ్బులు యింట వంట చేసే మనిషే.